భూ భారతి దరఖాస్తుల విచారణ



అంకుషాపూర్‌లో రైతులకు నోటీస్ అందజేస్తున్న నాయబ్ తహసీల్దార్ రాజేందర్

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో గతంలో స్వీకరించిన దరఖాస్తులను నాయబ్ తహసీల్దార్ రాజేందర్ శుక్రవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తిరిగి మరోసారి విచారణకు హాజరు కావాలని రైతులకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కావ్య, రైతులు ఆంజయ్య ముదిరాజ్, సాయిలుముదిరాజ్, మల్లేశ్, రాజేశ్, బిక్షపతి, నరసింహా, బాల్‌రాజ్ ముదిరాజ్, పాండు, సతీశ్, గోపినాథ్, రెవెన్యూ సిబ్బంది చందుముదిరాజ్, రాజేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శామీర్‌పేట్: మజీద్‌పూర్‌కు చెందిన అబ్బగౌని ఆనంద్‌కురూ.31,500, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ ఉద్దమర్రికి చెందిన మాధవశర్మకు రూ.59,500ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి శుక్రవారం సదరు చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు సంజీవయాదవ్, వంగ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగులకు అండగా జీవీకే ఈఎంఆర్‌ఐ

శామీర్‌పేట్: 108 ఉద్యోగులకు జీవీకే ఈఎంఆర్‌ఐ సంస్థ అండగా ఉంటుందని ఈఎంఆర్‌ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ సంస్థ తెలంగాణ స్టేట్ హెడ్ కిరణ్‌కిషోర్ అన్నారు. ఈఎంఆర్‌ఐలో పనిచేసే ఉద్యోగి ఈఎంటీ (ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్) అవుదాపురం విజేందర్ గత నెల 11న అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా ఈఎంఆర్‌ఐ సంస్థ తరపున రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య సునీతకు శుక్రవారం ఆయన అందజేశారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శించిన కాంగ్రెస్ నేతలు



ప్రభుత్వ పాఠశాలలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న సరిత, కాంగ్రెస్ నాయకులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత, నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిళ్ల కృష్ణయాదవ్, షేక్ గౌస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి

కాప్రా: యోగా జీవితంలో భాగం కావాలని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం భాష్యం స్కూల్ విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తి తన దినచర్యలో యోగా భాగం కావాలన్నారు. తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కామన్ యోగా కార్యక్రమం నిర్వహించి యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాష్యం సీఈఓ చైతన్య, ప్రిన్సిపాల్ అమరేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు స్వాతి, వనిత, మేరి, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థలో శుక్రవారం పలు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ జే.ప్రశాంతి నేతృత్వంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. 3వ డివిజన్ సాయి ఐశ్వర్య కాలనీలో అనుమతులకు మించి అదనంగా పలు అంతస్తులు నిర్మిస్తున్నట్లు గుర్తించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు గోడను కూల్చివేశారు. మున్సిపల్ అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని టీపీఎస్ ప్రశాంతి సూచించారు. నగరంలో అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పలు నిర్మాణాలపై తమకు అందిన సమాచారంతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి తగు చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ త్రిలేశ్వర్ రావు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

తహసీల్దార్లకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమణల నుంచి కాపాడాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తహసీల్దార్లను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో భూ సమస్యలపై జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాలు ,రెవెన్యూ గ్రామాల వారీగా ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా ప్రభుత్వ భూములపై ఉన్న వివాదాలు, కోర్టులో ఉన్న కేసుల పరిస్థితిపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఒక్కో కేసుకు సంబంధించిన తాజా వివరాలను సంబంధిత తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్య పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. సమావేశంలో లా ఆఫీసర్ చంద్రావతి, మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాం ప్రకాష్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మంజూరైన 1,409 ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు ఇంటింటికి తిరిగి తాజా పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పురోగతిపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాకు మంజూరైన ఇళ్లను 10 రోజుల్లో వంద శాతం గ్రౌండింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు 1409 ఇళ్లు మంజూరు కాగా, 516 ఇళ్లు ఇప్పటి వరకు పూర్తయ్యాయని, ఇంకా 900 ఇళ్లు గ్రౌండింగ్ కావాల్సి ఉందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణమూర్తి తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గ్రౌండింగ్ కాని 900 ఇళ్లపై 8 మంది ఏఈలు ఒక్కొక్కరూ 125 ఇళ్ల చొప్పున బాధ్యత తీసుకుని వచ్చే వారంలోగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక కోటాకు సంబంధించిన వెయ్యి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా ఎల్ - 2 జాబితాలో ఉన్న వారికి కేటాయించాలని ఆదేశించారు. డబ్బులు లేక ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్ నిర్మాణం చేయలేక పోతున్న వారికి మహిళా సంఘాల్లో చేర్పించి, రూ.లక్ష రుణ ం మంజూరు చేయించడం ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త, జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి, డీఈలు ,ఏఈలు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

పోచారం: తాగునీటి కోసం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కాచవానిసింగారంలో ప్రధాన రహదారిపై మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలోని మహేశ్వరి నగర్ కాలనీవాసులు నీటి సమస్యతో బాధపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. ఖాళీ బిందెలతో వార్డు కార్యాలయం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని ఆరు నెలల నుంచి అధికారులను కోరినా స్పందించడం లేదని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీళ్లు రావడంలేదన్నారు. దీనికి తోడు జలమండలి సరఫరా చేసే తాగునీరు కూడా అందడం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ ఏఈ మహిపాల్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



కాచవానిసింగారంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నేడు ప్రపంచ యోగా దినోత్సవం

కీసర: నాగారం మున్సిపాలిటీ శివాలయం వద్ద ఉన్న స్టార్ ఫంక్షన్‌హాలులో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కొకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం ఉదయం 6గంటల నుంచి 7.30 వరకు యోగాసనాలతో పాటు అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి యోగా గురువులు, నాగారం పుర ప్రముఖులు, కాలనీల అధ్యక్షులు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: వర్షాకాలంలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంత కుమార్ తెలిపారు. యంనంపేట్ ఫీడర్ పరిధిలోని యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. అవుషాపూర్ ఫీడర్ పరిధిలోని అవుషాపూర్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30గంటల వరకు.. బొక్కోనిగూడ వ్యవసాయ ఫీడర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్, ప్రశాంత్‌నగర్ కాలనీ, ఘనాపూర్‌లో సాయంత్రం 4.30 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డాక్యుమెంటేషన్‌కు సమయం ఇవ్వండి

మల్లాపూర్: స్కూల్ ఆటో, వ్యాన్లకు డాక్యుమెంటేషన్‌కు ఆర్టీఏ అధికారులు సమయం ఇవ్వాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారన్న అన్నారు. ఈ విషయమై శుక్రవారం ఉప్పల్ రవాణాశాఖ అధికారి రవీందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మారన్న మాట్లాడుతూ..డాక్యుమెంటేషన్ పేరుతో స్కూల్ ఆటోలు, వ్యాన్లు సీజ్ చేస్తుండటంతో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్యుమెంటేషన్‌కు గడువు ఇస్తే డ్రైవర్లకు మేలు చేసినవారవుతారని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ నాయకులు మహేష్ దేశపాక్, పాండునాయక్, సాయికుమార్, రామాంజీ, భూపతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన

మల్కాజిగిరి: విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల్లోనే మెరుగైన విద్యాబోధన అందుతుందని దీనిని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని పిల్లలను అందులోనే చేర్పించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నేరెడ్‌మెట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఉచిత భోజనం అందజేస్తున్నారని, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారన్నారు. ఎందరో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారే అన్నారు.స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలలకు చేయూత నందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయప్రద తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మల్లాపూర్: అంబేద్కర్‌నగర్–కార్తికేయనగర్ మార్గంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్‌ను శుక్రవారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పరిశీలించారు. నాచారం పెద్దనాలపై రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టే సమయంలో సమీపంలో పోచమ్మ ఆలయం వద్ద ఉన్న రిటైనింగ్ వాల్ కూలిపోయింది. దీంతో ఆ స్థానంలో ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ నిర్మించారు. రాబోయే బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని వంతెనపై నుంచి రాకపోకలు సాగేలా చూడాలని, వంతెన ఇరువైపుల రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆలయం చుట్టూ ఉన్న గుంతలను పూడ్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, బుచ్చన్నగడ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

భూ భారతిపై బోలెడు ఆశలు!

- ప్రక్షాళన దిశగా రెవెన్యూ వ్యవస్థ
- అమలుకు వీలుగా రెవెన్యూ సదస్సులు
- సదస్సులో వచ్చే ప్రతి ఫిర్యాదు పక్కాగా పరిశీలన

పోచారం: భూభారతి చట్టం అమలు చేసేందుకు వీలుగా గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులను జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించారు. అక్రమార్కులు, భూకబ్జాదారులపై భూభారతి చట్టం రామబాణమని ప్రజలు విశ్వసిస్తున్నారు. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి, భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఏప్రిల్ 14న భూభారతి చట్టం అమలులోకి వచ్చింది. ప్రజల వద్దకే రెవెన్యూ అనే నినాదంతో భూసమస్యలపై అందిన దరఖాస్తులను తహసీల్దారుతో కూడిన బృందం పరిష్కరిస్తోంది.

☛ ఘట్‌కేసర్ మండలంలోని పోచారం మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా భూముల లావాదేవీలు నిర్వహించిన పలువురు వ్యక్తులు జైలుకు వెళ్లిన సందర్భాలున్నాయి. అసైన్డ్ భూములకు పట్టా పాస్‌పుస్తకాలు పొందిన వ్యక్తులపై చర్యలు తీసుకున్న దాఖలాలు న్నాయి. భూములు విక్రయించిన వ్యక్తులే తిరిగి పాస్ పుస్తకాలు పొందారన్న ఆరోపణలూ బలంగానే వినిపిస్తున్నాయి. ఇలాంటి సమస్యలకు ముగింపు పలకాలంటే భూములకు చట్టబద్ధంగా రక్షణ కల్పించాలని ప్రజలు ఆశిస్తున్నారు.

కాచవానిసింగారం	9
ముత్వెల్లిగూడ	21
ఇస్మాయిల్‌ఖాన్‌గూడ	1
అన్నోజిగూడ	12
అంకుశాపూర్	63
మాదారం	26
అవుశాపూర్	34
యంనంపేట్	27
పడమటిసాయిగూడెం	10
ప్రతాపసింగారం	41
కొండాపూర్	25
ఎదులాబాద్	138
ఘట్‌కేసర్	42

పలు సమస్యలపై అర్జీలు...

రిజిస్ట్రేషన్, పెండింగ్ మ్యుటేషన్, ఆర్వోఆర్ మార్పులు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, నోషనల్ ఖాతా (హౌసింగ్ సైట్స్), పట్టా మార్పు, విస్తీర్ణంలో సవరణలు, ప్రొహిబిషన్ జాబితా నుంచి తొలగింపు, పెండింగ్ సక్సెషన్, నాలా మార్పు, పేర్ల మార్పు, చిరునామా, కులం సవరణలు, సాదాబైనామా, రక్షిత అద్దెదారుల ఆధీనంలోని భూముల యాజమాన్యం (38ఈ), ఇనాం భూమికి ఓఆర్‌సీ (ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికేట్) వంటి సమస్యలపై మండల రెవెన్యూ అధికారులకు అర్జీలు అందాయి.

దరఖాస్తు చేసుకోని వారికి మరో అవకాశం...

రెవెన్యూ సదస్సులో అర్జీలు అందజేయని వారు ఆన్‌లైన్‌లో భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. లేదంటే తహసీల్దారు కార్యాలయంలో అర్జీ పెట్టుకునే అవకాశం కల్పిస్తారు. అర్జీలను ఆగస్టు 14వ తేదీలోపు అధికారులు పరిష్కరిస్తారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి రిజిస్టర్డ్ ఐడీ ఇస్తారు. ఏళ్లకు ఏళ్లు పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు, భూభారతి చట్టంపై ప్రజలు బోలెడు ఆశలు పెట్టుకున్నారు.

మండలంలో వచ్చని అర్జీలు 552...

ఘట్‌కేసర్ మండలంలో మొత్తం 552 అర్జీలు అందాయి. రెవెన్యూ సదస్సులు ముగియడంతో అర్జీల పరిశీలన ప్రక్రియ మొదలైంది. గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులు కింది విధంగా ఉన్నాయి.

బస్‌పాస్‌లు ఎప్పుడొస్తాయో..?

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి
- విద్యాసంస్థలు ప్రారంభమైన అందుబాటులో లేని సర్టిఫికెట్లు
- ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



మేడ్చల్: విద్యాసంస్థలు ప్రారంభమై వారం దాటినా విద్యార్థులకు మాత్రం బస్సు పాసులు అందడం లేదు. దీంతో చార్జీలు చెల్లించి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా నిరుపేద విద్యార్థులే చదువుతుంటారు. వారు ఓ గ్రామం నుంచి మరో ఊరికి వెళ్లి చదవుకోవాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈనెల 12న పాఠశాలలు షురూ కాగా ఇప్పటివరకు బస్సు పాసుల జారీ ప్రక్రియ ప్రారంభించకపోవడంతో విద్యార్థులు రోజుకు రూ. 50 వరకు వెచ్చిస్తున్నారు. గతంలో ఆర్టీసీ వారు ఉపాధ్యాయులు ఇచ్చే జాబితా మేరకు స్కూల్‌కు వెళ్లి విచారించేవారు. విద్యార్థుల ఐడీని, ఉపాధ్యాయులు ఇచ్చే సమాచారాన్ని జత చేసుకుని బస్సుపాసులు తయారు చేసి పాఠశాలల్లోనే విద్యార్థులకు నేరుగా అందజేసేవారు. కానీ ప్రస్తుతం నిబంధనలు మారడంతో పాసుల కోసం విద్యార్థులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది.

బాలురకు తప్పని తిప్పలు

ఆడపిల్లలకు మహాలక్ష్మి పథకం వర్తించడంతో ఆధార్‌కార్డుతో ఆర్టీసీ బస్సుల్లో విద్యాసంస్థలకు రాకపోకలు సాగిస్తుండగా, బాలురకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. జడ్పీ పాఠశాలలు ప్రతీ గ్రామంలో ఉండే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు 5, 10 కిలోమీటర్ల దూరంలో ఉండే స్కూళ్లకు వెళ్లి చదవుకోవాల్సి వస్తోంది. సమయానికి బస్సులు ఉన్నా పాసులు లేకపోవడంతో రానుపోను రూ.50 పెట్టుకుని వీలైతే, బస్సులో లేదా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది. దీంతో చాలామంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు బడికి పంపేందుకు వెనకాడుతున్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..

ఆర్టీసీ నిబంధనలు మార్చి బస్సు పాసుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నిబంధనలు పెట్టడంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థుల ఐడీ, బోనోఫైడ్, వారి ఫొటోతో కూడిన పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాస్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆర్టీసీ వారు పరిశీలించి పాసును జారీ చేస్తారు. అయితే విద్యార్థులకు కావాల్సిన పత్రాలు పాఠశాలల్లో అందుబాటులో లేకపోవడంతో పాసుల జారీ ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు ఎలా ఉన్నా.. వీలైనంత త్వరగా బస్సు పాసులు జారీ చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం



మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపో పరిధిలో మే నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ శ్రామికులకు యాజమాన్యం ప్రగతి చక్రాల పురస్కారాలను అందజేసింది. శుక్రవారం డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎం సుధాకర్ శ్రామికులను శాలువాలతో సన్మానించి మెమెంటోను, ప్రశంస పత్రాలను అందజేశారు. బ్రేక్ డౌన్ లేకుండా బస్సులు నడపడం, ఇంధనం పొదుపు చేయడం, వంటి వాటిలో ప్రతిభ చూపిన వారికి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

కాప్రా: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్ల నాయకులు శుక్రవారం కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌తో కార్మికుల ఉద్యోగ భద్రత, హక్కులు తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నారు. కనీస వేతనం రూ. 26వేలు నిర్ణయించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై సెంట్రల్ ఎక్సైజ్ తగ్గించాలని, ఆహారం, మందులు, వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పనిగంటలు 10 గంటలు పెంచే ప్రయత్నం జరుగుతుందన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ జులై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రావు, ఎర్ర అశోక్, ప్రవీణ్, లక్ష్మయ్య, ప్రభాకర్, ఉన్ని కృష్ణ, రేవతి కల్యాణి, శ్రీనివాస్, రాజశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చలో రాజ్‌భవన్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఘట్‌కేసర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐవైఎఫ్ ఘట్‌కేసర్ మండల శాఖ ఆధ్వర్యంలో 'చలో రాజ్‌భవన్'వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ... మావోయిస్టులు, గిరిజనులపై చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులను సాకుగా చూపి దాడులు చేస్తున్నారని విమర్శించారు. చర్చలు జరపకుండా వారిని చంపడం ఫాసిస్టు ప్రభుత్వ లక్షణమని ఆరోపించారు. ఈనెల 23న నగరంలో నిర్వహించతల పెట్టిన 'చలో రాజ్‌భవన్'కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యప్రసాద్, శివ, గిరిబాబు, శివకుమార్, వెంకటేశ్, చెన్నయ్య, అంజి, శ్రీను, పద్మశ్రీ పాల్గొన్నారు.

కార్మిక రంగ సమస్యలపై పోరుబాట

- ఆగష్టు 19 నుంచి గాజులరామారంలో సీపీఐ రాష్ట్ర మహాసభలు
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సీపీఐ కార్యదర్శి ఉమామహేష్

సాక్షి,సిటీబ్యూరో: కార్మిక రంగ సమస్యలపై పోరాటం ఉధృతం చేయనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ తెలిపారు. ఈ మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గాజులరామారంలో ఆగస్టు 19 నుంచి 22 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో కార్మిక రంగ సమస్యలు, ప్రజాసమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. శుక్రవారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సభల విజయవంతానికి పార్టీ కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఇటీవల ఈసీఐఎల్‌లో జిల్లా మహాసభలు నిర్వహించి 15 మందితో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.



భూ పోరాటలు ఉధృతం..

మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ భూముల పరిరక్షణ ,పేదలకు నివాసస్థలాలు, ఇళ్ల నిర్మాణ తదితర సమస్యలపై సీపీఐ పోరాటాలను ఉధృతం చేస్తుందని ఉమామహేష్ తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ప్రకటించారని, ప్రస్తుతం కూడా భూకబ్జాలు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు ఈ భూకబ్జాలను అడ్డుకొని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలను ఉధృతం చేసి పేదలకు పంచుతామన్నారు.

ప్రభుత్వ విద్య, వైద్యాన్ని బలోపేతం చేయాలి...

మేడ్చల్ జిల్లాలో 15 మండలాలు ఉండగా కేవలం నాలుగు డిగ్రీ కాలేజీలు మాత్రమే ఉన్నాయన్నారు. దీంతో వేలాది మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలానికి ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కోసం సీపీఐ పోరాడుతుందన్నారు. నేడు పేద, మధ్య తరగతి ప్రజలకు విద్య, వైద్యం భారంగా మారిందన్నారు. వాటి బలోపేతం కోసం పోరాడుతామని అన్నారు. ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పూనుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్మిక రంగ సమస్యలపై ఆందోళనలు...

పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న మేడ్చల్ జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీపీఐ కార్యదర్శి ఉమామహేష్ తెలిపారు. కార్మికులకు తక్కువ వేతనాల ఇచ్చి బానిసలుగా పని చేయించుకుంటున్నారని అన్నారు. జిల్లా పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు 75శాతం రిజర్వేషన్ కల్పించాలని పోరాటం చేస్తామన్నారు. మీడియా సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, సత్యప్రసాద్, వి.శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు సల్మాన్ బిగ్, రాములు గౌడ్, రాకేష్ పాల్గొన్నారు.